# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

13 | హైదరాబాద్, శనివారం 2 మార్చి 2024 | VIKARABAD




జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయకుండా సంరక్షణ బాధ్యతను గాలికొదిలేసినమున్సిపల్ సిబ్బంది

# పచ్చధనమేదీ!

- మున్సిపాలిటీల్లో అధికారుల చేతివాటం
- గ్రీన్ బడ్జెట్ నిధుల దుర్వినియోగం
- మొక్కలు నాటకుండానే నాటినట్లుగా లెక్కలు
- ఉన్న మొక్కల సంరక్షణకూ చర్యలు శూన్యం
- ట్రీ గార్డుల ఏర్పాటు మాటలకే పరిమితం
- పట్టణాల్లో కానరాని పచ్చదనం

వికారాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): మున్సిపాలిటీల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మున్సిపాలిటీల అధికారులు ఎలాంటి చొరవ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మొక్కలు నాటడం, సంరక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం ఏటా కేటాయిస్తున్న గ్రీన్ బడ్జెట్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, కొడంగల్, వికారాబాద్ మున్సిపాలిటీల్లో గ్రీన్ బడ్జెట్ కింద ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నారు. అధికారులు మొక్కలు నాటుతున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. రోడ్లకు ఇరువైపులా, పార్కుల్లో మొక్కలు నాటడం, మొక్కల సంరక్షణకు ట్రీ గార్డుల ఏర్పాటుకు గ్రీన్‌బడ్జెట్ నిధులను వెచ్చిస్తున్నట్లు లెక్కలు చూపుతున్నా ఎక్కడా మొక్కలు నాటిన దాఖలాలు లేవు. అక్కడక్కడ నాటిన, ఇదివరకే ఉన్న మొక్కల సంరక్షణ చర్యలను విస్మరించడంతో ఎండలకు చనిపోతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నాలుగు మున్సిపాలిటీల్లో గ్రీన్ బడ్జెట్ నిధులు రూ.2.29 కోట్ల ఖర్చు చేసినట్లు లెక్కల్లో పొందుపర్చారు. వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.58.09 లక్షలు, తాండూరు రూ.55.41 లక్షలు, పరిగి రూ.64 లక్షలు, కొడంగల్‌లో 52 లక్షల నిధులను పచ్చదనం పెంపునకు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో చాలావరకు నిధులను అధికారులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తున్నది. ఈ నిధులపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయం ఆయా మున్సిపాలిటీల ప్రజల నుంచి వ్యక్తమవుతున్నది.

**నిధుల దుర్వినియోగం..**

మున్సిపాలిటీల్లో గ్రీన్ బడ్జెట్ కింద ఖర్చు చేస్తున్న నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ప్రతి మున్సిపాలిటీలోనూ ఏటా రూ.50 లక్షలకుపైగా నిధులు ఖర్చు చేస్తుండగా, ఇందులో సగానికిపైగా నిధులను అధికారులు కాజేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ప్రభుత్వమే గ్రామానికో నర్సరీని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున మొక్కలను పెంచుతున్నప్పటికీ.. ప్రైవేట్ నర్సరీల నుంచి వేలల్లో మొక్కలను కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపించడం పలు అనుమానాలకు బలం చేకూర్చుతున్నది. మొక్కల కొనుగోలు సాకుతో ప్రతి మున్సిపాలిటీలో రూ.5 లక్షల వరకు దుర్వినియోగం చేసినట్లు తెలుస్తున్నది. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటకముందే నాటినట్లు చెబుతూ డబ్బులు కాజేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గతంలో నాటిన మొక్కలను ఈ బడ్జెట్ నిధులతోనే నాటినట్లు లెక్కలు చూపడం గమనార్హం. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతనూ మున్సిపాలిటీల అధికారులు విస్మరించారు. గ్రీన్ బడ్జెట్‌లో భాగంగా మొక్కలు నిత్యం నీరు, ట్రీగార్డులు ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. దీంతో ఏటా నాటుతున్న మొక్కల్లో 20 శాతం కూడా బతకడం లేదు.

**ట్రీ గార్డులకు రూ.10 లక్షలంట..**

మొక్కలకు ట్రీ గార్డుల ఏర్పాటు విషయంలోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ట్రీ గార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు కేవలం లెక్కల్లోనే చూపుతున్నారు. నాలుగు మున్సిపాలిటీల్లోనూ కనీసం పది మొక్కలకు కూడా ట్రీగార్డులు ఏర్పాటు చేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ట్రీ గార్డుల ఏర్పాటుకుగాను ప్రతి మున్సిపాలిటీలో రూ.10 లక్షల వరకు ఖర్చు చూపడం గమనార్హం.



వికారాబాద్ మున్సిపాలిటీ ధన్నారం వెళ్లే దారిలో కనిపించని మొక్కలు

## పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి

కులకచర్ల, మార్చి 1 : పంటల వివరాలను ఏఈవోల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కుస్మసముద్రం గ్రామంలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏఈవోలు తప్పని సరిగా పంటలను పరిశీలించాలని ఆదేశించారు. ఆయన వెంట కులకచర్ల మండల వ్యవసాయాధికారి వీరస్వామి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



కుస్మసముద్రం గ్రామంలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



జాతరకు పోటెత్తిన జనం

# భక్తజన సంద్రం

## కనుల పండువగా పోలేపల్లి ఎల్లమ్మ సిడె తల్లి దర్శనంతో పులకించిన భక్తులు



అమ్మవారికి బోనాలు తీస్తున్న భక్తులు

బొంరాస్‌పేట, మార్చి 1 : దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ జాతరలో శుక్రవారం ప్రధాన ఘట్టమైన సిడె కార్యక్రమం శుక్రవారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. మమ్మల్ని చల్లంగా చూడు ఎల్లమ్మ తల్లీ.. అంటూ భక్తుల కేరింతలు, జయ జయ ధ్వానాలు చేశారు. మేళ తాళాలు, డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో సిడె కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. జల్ది ఉత్సవంలో భాగంగా దేవాలయంలోని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గుడికి సమీపంలో ఉన్న బావి దగ్గరికి మేళతాళాలు, కొమ్ము వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ బావిలో విగ్రహానికి స్నానం చేయించిన తరువాత మళ్లీ గుడికి చేరుకున్నారు. గుడి ముందు కుంభం పోసిన తరువాత ఆలయ కమిటీ చైర్మన్ ఏదుల జయరాములు, మేనేజరు రాజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించిన రథానికి ఉన్న పొడవైన స్తంభానికి చివరన ఏర్పాటు చేసిన తొట్టెలలో ఉంచి ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేయించారు.

ఈ సమయంలో అమ్మవారి రథాన్ని లాగడానికి భక్తులు వేల సంఖ్యలో పోటీ పడ్డారు. సిడె తిరుగుతున్న సమయంలో మహిళలు, పురుషులు సవారి నిండి ముందు నడిచారు. భక్తులు వేపాకు, పసుపు, గవ్వలు కలిపిన గవ్వల భండారును అమ్మవారిపైకి విసిరారు. కింద పడిన గవ్వలను తీసుకోవడానికి కూడా భక్తులు పోటీ పడ్డారు.

సిడె కార్యక్రమాన్ని తిలకించడానికి ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పొరుగు జిల్లాలు, మహారాష్ట్రలోని షోలాపూర్, భీవండి, గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్‌ల నుంచి రెండు లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. సిడె జరిగినంత సేపూ ఆలయం కనుచూపు మేరలో ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. అమ్మవారికి బోనాలు, మేకపోతులు, కోడి పుంజులతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానం చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జాతర ప్రాంగణంలో విడిది చేశారు. అమ్మవారి దర్శనభాగ్యంతో భక్తులు తన్మయత్వం చెందారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**ప్రత్యేక బస్సులు..**

ఎల్లమ్మ జాతరకు ఆర్టీసీ వారు కోస్గి, తాండూరు, పరిగి, నారాయణపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. షోలాపూర్ నుంచి తాండూరు బస్సు స్టేషన్ కిటకిటలాడింది. కొందరు భక్తులు ప్రైవేటు వాహనాలు, బండ్లపై వచ్చారు. తాగునీటి సమస్య రాకుండా ఆలయ కమిటీ ట్యాంకర్లను ఏర్పాటు చేసింది. వైద్యాఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

## ఆరాంఘర్ చౌరస్తాలో బస్ టర్మినల్

# నిర్మించాలి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 1: ఆరాంఘర్ చౌరస్తాలో అంతర్రాష్ట్ర బస్ టర్మినల్‌ను నిర్మించాలని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, సిటిజన్ వెల్ఫేర్ కౌన్సిల్ అధ్యక్షుడు అనంతమోహన్ మాట్లాడుతూ.. కాటేదాన్ గ్రామ సర్వే నంబర్ 54, 55, 56లో మొత్తం 16 ఎకరాల 20 గుంటల భూమిని 1964లో ఉమ్మడి ప్రభుత్వం ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్‌కు కేటాయించిందన్నారు. తెలంగాణ ఏర్పాటు తరువాత అందులో ఉన్న వృద్ధులను వేరే ప్రాంతానికి తరలించినట్లు చెప్పారు. కొందరు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారన్నారు. దీంతో అప్పట్లో రంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేసిన డీఎస్ లోకేశ్‌కుమార్ ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా రెవెన్యూ అధికారులతో సర్వే నంబర్ 54/2, 55/2 ఆరాంఘర్ చౌరస్తాలోని నేషనల్ హైవే 44కు అనుకొని ఉన్న భూమిని మ్యాపింగ్ వేసి సర్వే చేయించినట్లు పేర్కొన్నారు. అధికారుల నివేదిక ఆధారంగా 2018లో ఆర్టీసీకి ఏడెకరాల 22 గుంటలను ఆధీనంలోకి తీసుకొని.. అంతర్రాష్ట్ర బస్ టర్మినల్‌ను నిర్మించాలని రాతపూర్వకంగా టీఎస్‌ఆర్టీసీ ఎండీకి పంపించారని చెప్పారు. అయినా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

వెంటనే అంతర్రాష్ట్ర బస్ టర్మినల్ బస్టాండ్ నిర్మించాలని, దీనివల్ల బెంగళూరు, తిరుపతి, కర్నూలు మహబూబ్‌నగర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. మిగిలిన 8 ఎకరాల 38 గుంటల ప్రభుత్వ భూమిలో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆనంద్, సాయిలు, మహ్మద్ ఖాజా, సత్యం, బాల్‌రాజ్, జగన్, కృష్ణారెడ్డి, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆరాంఘర్ చౌరస్తాలోని బస్టాప్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు




ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలంలోని ఓ ప్రభుత్వ కళాశాల నుంచి ట్రాక్టర్‌లో పరీక్షా కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులు

# భద్రతకు 'పరీక్ష'

**విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం.. ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలల అధికారుల నిర్లక్ష్యం.. పరీక్షా కేంద్రాలకు ట్రాక్టర్లలో ప్రమాదకరంగా తరలింపు**

విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నది. పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామంటున్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలల విద్యార్థులను ట్రాక్టర్లలో తరలించడమే. విద్యార్థుల తరలింపునకు మినీ బస్సులు, ఫిట్‌నెస్ ఉన్న వాహనాలను వినియోగించాల్సి ఉండగా.. అధ్యాపకులు మాత్రం కాసులకు కక్కుర్తిపడి తక్కువ ఖర్చుతో వచ్చే డీసీఎంలు, ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలను వినియోగిస్తున్నారు. అదీకూడా ప్రమాదకర స్థాయిలో ఒక్కో ట్రాక్టర్‌లో సుమారు 50 నుంచి 60 మందిని ఎక్కిస్తున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఇబ్రహీంపట్నం, మార్చి 1



చికిత్స చేయించిన అనంతరం భవానిని పరీక్షా కేంద్రంలోకి పంపిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

# చికిత్స చేయించి.. పరీక్ష రాయించి..

- గాయపడిన విద్యార్థినికి చేయూత..
- మానవత్వాన్ని చాటుకున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

బేగంపేట, మార్చి 1: పరీక్ష రాసేందుకు వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి చికిత్స చేయించి.. పరీక్ష రాయించి.. ఓ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఇంటర్ పరీక్ష రాసేందుకు శుక్రవారం విద్యార్థిని భవానీ తన తండ్రితో కలిసి ద్విచక్రవాహనంపై సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని తపస్య కాలేజీకి వెళ్తుండగా, ప్యారడైజ్ సీటీవో జంక్షన్ వద్ద బండి స్కిడ్ కావడంతో రోడ్డుపై పడిపోయి..గాయపడింది. తీవ్ర గాయాలతోనే పరీక్షా కేంద్రానికి వచ్చింది. సమయం మించిపోతుండటంతో చేసేది లేక పరీక్ష రాస్తానని చెప్పింది. అయితే అక్కడే విధులు నిర్వహిస్తున్న మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పరీక్షా కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి..కొంత సమయం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆమెను తన వాహనంలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించి తిరిగి పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. మానవత్వాన్ని చాటుకున్న ఉపాశంకర్‌కు భవాని కృతజ్ఞతలు చెప్పింది.

## హెచ్‌ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా వీరారెడ్డి

సిటీబ్యూరో, మార్చి 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ఎస్టేట్ ఆఫీసర్‌గా వీరారెడ్డి బదిలీపై వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇటీవలే బదిలీపై వచ్చిన మహ్మద్ అసదుల్లాకు సికింద్రాబాద్ అడిషనల్ ఆర్‌వోగా బాధ్యతలు అప్పగించారు. దీంతో యాదాద్రి భువనగిరి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న వీరారెడ్డి హెచ్‌ఎండీఏ బాధ్యతలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల వరకు ప్రత్యేకంగా ఎస్టేట్ ఆఫీసర్ విధుల్లో ఉండేలా ఈ బదిలీలు చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.